తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం-30- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 94 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# విద్యా సంస్థల్లో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలి



- మెరుగైన విద్యా బోధన, బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశం
- బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలి
- మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలి
- బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- ఐసీసీసీలో ముఖ్యమంత్రి విద్యా శాఖలపై సమీక్ష

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన విద్యా బోధన, బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కాలేజీల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని చెప్పారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగుపడటంతో పాటు లోటుపాట్లను అరికట్టవచ్చని అన్నారు.

మిగతా 2లో



# చేయూత పింఛన్ల పంపిణీలో సాంకేతిక విప్లవం

- సత్వర సేవల కోసం నూతన విధానంలో పెన్షన్ల పంపిణీకి శ్రీకారం
- పోస్ట్ మాస్టర్లకు 5G మొబైల్ ఫోన్ల అందజేత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సీతక్క
- రాష్ట్రవ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు 5G మొబైల్ ఫోన్లు, ఫింగర్ ప్రింట్ మెషీన్లు
- ఇక నుంచి పారదర్శకంగా వేగవంతంగా పింఛన్ల పంపిణీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, ఒంటరి మహిళలు, హెచ్‌ఐవీ, డయాలసిస్ భాదితులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు చేయూత పథకం కింద ప్రభుత్వం అందజేస్తుంది. ఇప్పటి వరకు పింఛన్ దారుల ధృవీకరణ కోసం 2G ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగిస్తున్నారు.

మిగతా 2లో



# స్కూల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించండి

## యాజమాన్యాలకు పోలీస్ కీలక ఆదేశాలు!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ యాజమాన్యాలతో సమన్వయ సమావేశం జరిగింది. మాదాపూర్ జోన్ పరిధిలోని పలు ప్రముఖ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి జాయింట్ సీపీ ట్రాఫిక్ డా. గజారావు భూపాల్, ఐపీఎస్, ఇతర ట్రాఫిక్ అధికారులు హాజరయ్యారు. స్కూల్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు సంబంధించిన ట్రాఫిక్ నిర్వహణ, రద్దీ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్కూల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ట్రాఫిక్ అధికారులు హైలైట్ చేశారు. విద్యార్థులు ఎక్కువ మంది స్కూల్ బస్సులను ఉపయోగించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గిస్తే, స్కూల్ పరిసర ప్రాంతాల్లో వాహన రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు.

మిగతా 2లో


# యూరియా సరఫరాలో ఫలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోనున్నట్లు వ్యవయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో



# ఉధృతంగా ప్రవహిస్తోన్న కృష్ణా నది

## నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న వరద

నల్లగొండ, (తెలంగాణ ముచ్చట్లు) :

కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి నాగార్జున సాగర్ వైపునకు కృష్ణమ్మ ఉరకలేస్తుంది. దీంతో నాగార్జున సాగర్ నిండు కుండలా మారింది. వరద ప్రవాహం భారీగా ఉండడంతో.. 26 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 24 గేట్లు 5 అడుగులు, 2 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

మిగతా 2లో



# సెప్టెంబర్ 2 వరకు తెలంగాణలో వర్షాలు

- హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం..
- స్తంభించిన జనజీవనం..

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగరంలోని పలు ప్రాంతాల్లో గంట సేపటి నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురుస్తోంది. హిమాయత్ నగర్, నారాయణగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ట్యాంక్ బండ్, అంబర్ పేట్, కాచిగూడ, ఓయూ క్యాంపస్, విద్యానగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. లకిడీకాపూల్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్ సెక్రటేరియట్, ట్యాంక్ బండ్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, ఐమాక్స్, ఎన్టీఆర్ గార్డెన్స్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ ప్రయాణం కోసం గంటల సమయం పడుతోంది. కాగా, భారీ వర్షా ల నేపథ్యంలో నగర వాసులకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది.

మిగతా 2లో

# నాకు బాస్‌లు ఎవరూ లేరు

- స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి వెళతానని వ్యాఖ్య
- తెలంగాణలో బీజేపీ భ్రష్టు పట్టింది
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ శాసనసభ సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను అసెంబ్లీకి స్వతంత్ర సభ్యుడిగానే హాజరవుతానని, ఇకపై తనను ఎవరూ కట్టడి చేయలేరని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో




# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- గాఢ నిద్రలోనే భర్త చనిపోయాడంటూ 100కు డయల్
- పోలీసుల ఎంట్రీతో సీన్ రివర్స్!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రియుడితో కలిసి భర్తను భార్యే హత్య చేసిన ఘటన హైదరాబాద్ మహానగరంలో కలకలం రేపింది. హత్యను గుండెపోటుగా మార్చేందుకు ప్రయత్నించిన నిందితులు.. మృతదేహంపై గాయాలతో పోలీసులకు అడ్డంగా బుక్కయ్యారు. జెల్లెల శేఖర్ చిట్టి దంపతులు హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ కోదండరాం నగర్‌లో

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చేయూత పింఛన్ల పంపిణీలో సాంకేతిక విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ద్వారా "సరైన వ్యక్తికి సరైన పింఛన్ సరైన సమయంలో" అందేలా పింఛన్ పంపిణీ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మారనుంది.

ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్‌తో 5G ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలు, కొత్త మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసింది. ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో ఈ పరికరాలను ప్రభుత్వం వినియోగించింది. ఆశించిన ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, పరికరాలు పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ మొబైల్ ఫోన్లు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లాలోని పస్రా కేంద్రంలో ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు పరికరాలను అందజేయనున్నారు. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను ౦Gాఅశ్రీఅఅవ ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. కొత్త సాంకేతిక పరిష్కారం వల్ల పింఛన్ దారుల ధృవీకరణ సమయం మూడు సెకన్లకు తగ్గి, పింఛన్లు వేగంగా పంపిణీ అవుతాయి. దీంతో లబ్ధిదారులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెను వెంటనే తమ పింఛన్లు అందుకుంటారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, వృద్ధులు, వేలిముద్రలు చెరిగిన వారు వంటి వారికి ముఖ గుర్తింపు యాప్ ఎంతో మేలు చేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఈ పథకం డిజిటల్ రూపాంతరం పొందటం ద్వారా పింఛన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగి పింఛన్ దారులకు సత్వర సేవలు అందుతాయని మంత్రి సీతక్క ప్రకటించారు. పించన్దారుల సమస్యల దృష్టిలో పెట్టుకొని ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు.





# విద్యా సంస్థల్లో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

ఐసీసీసీలో ముఖ్యమంత్రి విద్యా శాఖలపై సమీక్షించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలి. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం చూపొద్దు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి. వాటిపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలి. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలి. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలి.

విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూస్తున్నామని ముఖ్యమంత్రి గారు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాలో ఫలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

పోర్టుల నుంచి ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్ నగర్, గజ్వేల్ ప్రాంతాలకు యూరియా చేరుకోనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పుకొచ్చారు. అక్కడి నుంచి డిమాండ్ పరంగా జిల్లాలకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని పేర్కొన్నారు. యూరియా కొరతతో కొంతమంది రాజకీయలు చేశారని మండిపడ్డారు. యూరియాను త్వరలోనే అన్ని జిల్లాలకు సరఫరా చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అలాగే మంత్రి తుమ్మల వరదల కారణంగా జరిగిన పంట నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. శుక్రవారం సాయంత్రానికి నిర్దిష్టమైన లెక్కలతో పంట నష్టం వివరాలు అందించాలని ఆదేశించారు. బృందాలుగా ఏర్పడి జిల్లాలలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని సూచించారు. అనంతరం వరద బాధిత ప్రాంతాల కలెక్టర్లతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.





# స్కూల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించండి

(మొదటి పేజీ తరువాయి)

అలాగే రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో స్కూల్ పక్కన, యూటర్న్ వద్ద ప్రధానంగా సమస్యలు ఎదురవుతున్నాయని, అందువల్ల స్కూల్ వాహనాల కదలికకు సమర్థవంతమైన ప్రణాళిక అవసరమని సూచించారు. ఒకే మార్గంలో ఒకేసారి ఎక్కువ స్కూల్ వాహనాలు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు స్కూల్ సమయాలను వ్యత్యాసం పాటించేలా చూడాలని కూడా యాజమాన్యాలను కోరారు. ఇక తల్లిదండ్రులకు కార్ పోలింగ్ పద్ధతి గురించి అవగాహన కల్పించడం ద్వారా రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గించే అవకాశం ఉందని ఈ సమావేశంలో చర్చించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం బస్సు డ్రైవర్లకు నిరంతరంగా ఆల్కహాల్ పరీక్షలు నిర్వహించాలని, అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు స్పష్టమైన మార్గదర్శకాలు, ప్రయాణ మార్గాలను స్కూల్ యాజమాన్యాలు అందించాలని సూచించారు. ఈ విధంగా స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు, ట్రాఫిక్ పోలీసులు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే సురక్షితమైన, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ సాధ్యమని అధికారులు పేర్కొన్నారు.



# ఉధృతంగా ప్రవహిస్తోన్న కృష్ణా నది


(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2,61,972 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ స్పిల్ వే ద్వారా 2,16,842 క్యూసెక్కులు విడుదల చేశారు. సాగర్ కుడి కాలువకు 8,529 క్యూసెక్కులు విడుదల చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 587.40 అడుగులుగా ఉంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 305.74 టీఎంసీలుగా ఉంది.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

(మొదటి పేజీ తరువాయి)

నివాసం ఉంటున్నారు. వీళ్లిద్దరికీ 16ఏళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు పిల్లలు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ.. వచ్చే సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు శేఖర్. అప్పుడప్పుడు గిరాకీని బట్టి లాంగ్ డ్రైవ్ వెళ్లేవాడు. ఆ సమయంలో హరీష్ అనే వ్యక్తికి కనెక్ట్ అయింది చిట్టి. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం నడుస్తోంది. చాలా రోజులుగా గుట్టుగా సాగుతోందీ వ్యవహారం. ఓ రోజు భర్తకు అనుమానం రావడంతో భార్యపై ఫోకస్ పెట్టాడు. అప్పుడు బయటపడిరది ఇల్లీగల్ రిలేషన్. సంబంధం సరికాదని.. పద్ధతిగా మార్చుకోవాలని భార్య చిట్టిని మందలించాడు భర్త శేఖర్. దీంతో తమ శారీరక సుఖం కోసం శేఖర్ అడ్డు అని భావించారు చిట్టి, హరీష్. హత్యకు స్కెచ్ వేశారు. డ్రైవింగ్‌కి వెళ్లి ఇంటికొచ్చిన శేఖర్.. రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. గాఢ నిద్రలో



ఉన్న సమయంలో హరీష్‌కి కాల్ చేసి ఇంటికి పిలిపించింది చిట్టి. ఒకరు గొంతు నులుమగా మరొకరు తలపై డంబెల్‌తో మోది హతమార్చారు. తమపై అనుమానం రాకుండా డయల్ 100కి కాల్ చేసి సమాచారం ఇచ్చారు. స్పాట్‌కి చేరుకున్న సరూర్‌నగర్ పోలీసులు.. గాయాలైన శేఖర్‌ను ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు.. తలపై గాయాల కారణంగానే చనిపోయినట్టు నిర్ధారించారు.

శేఖర్ మృత దేహాన్ని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. భార్య చిట్టిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా మొదట్లో తడబడిరది. ఆ తర్వాత కాస్త గట్టిగా అడగడంతో ప్రియుడితో కలిసి హతమార్చినట్టు అంగీకరించింది. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయని బంధువులు చెబుతున్నారు. వాటి కారణంగా ఇంత చిట్టి ఇంత దారుణానికి తెగబడుతుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న ప్రియుడు హరీష్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. భర్త హత్యకు గురయ్యాడు భార్య అరెస్ట్ అయ్యింది.

# నాకు బాస్‌లు ఎవరూ లేరు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో బీజేపీ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని రాజాసింగ్ తీవ్రంగా విమర్శించారు. పార్టీలోని కొందరు నేతల వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని, వారి వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. "ఇప్పుడు నాకు ఎవరూ బాస్‌లు లేరు. నన్ను ఎవరూ అదుపు చేయలేరు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం దొరికింది" అని రాజాసింగ్ అన్నారు. తానుగా మళ్లీ బీజేపీలో చేరే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. కేవలం పార్టీ జాతీయ నాయకత్వం నుంచి పిలుపు వస్తేనే తిరిగి చేరికపై ఆలోచిస్తానని చెప్పారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు అసెంబ్లీ సమావేశాల ముందు బీజేపీలో కలకలం రేపాయి.





# సెప్టెంబర్ 2 వరకు తెలంగాణలో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉంటేనే తప్ప బయటకు రావద్దని స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 2వ తేదీ వరకు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడిరచింది. శనివారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపింది.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు**

**తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:**

పేదల సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించి, పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూస్, రెండు జతల సాక్స్ పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... గతంలో ఉన్న బీటీ రోడ్డు గత సంవత్సరం వచ్చిన వరదలో కొట్టుకొని పోయిందని, కోటి 22 లక్షలతో పాలేరు పిడబ్ల్యుడి రోడ్డు నుంచి హట్యాతండా వరకు బీటీ రోడ్డు మరమ్మతుల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు.

గతంలో వరదలకు దెబ్బతిన్న కాలువలు, రోడ్ల మరమ్మత్తు పనులు, అంతర్గత సీసీ రోడ్డు, పశు వైద్యశాల, త్రాగునీటి సరఫరా పనులు, లింక్ కెనాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. టెండర్ ప్రక్రియ త్వరగా ముగించి అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

మల్లాయిగూడెం నుంచి భగత్ వీడు వరకు రూ. 3 కోట్ల 30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, గతంలో రూ. 45 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని, త్రాగునీటి సమస్యలు పరిష్కరించామని తెలిపారు.

లింగారంతండాలో రూ. 20 లక్షల రూపాయలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించామని అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత లింగారాం తండా, గన్యా తండా వేరు వేరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ భవనానికి ప్రహరీ గోడ, అంగన్వాడీ భవనం త్వరలో మంజూరు చేస్తామని అన్నారు.

జీళ్ల చెరువు గ్రామంలో రూ. 2 కోట్ల 25 లక్షలతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డు నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ వరకు ఉన్న ఘాట్ రోడ్డు, రూ. 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. జీళ్ళ చెరువు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం డబుల్ లైన్ రోడ్డు, సైడ్ డ్రైయిన్లతో అద్భుతంగా తీర్చిదిద్దే దిశగా డిజైన్ చేశామని, ఈ రోడ్డు త్వరగా పూర్తి చేసి ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తర్వాత ప్రజల దీవెనలతో పేదల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయల గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, 7 లక్షల రేషన్ కార్డులు జారీ, రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ నిధుల జమ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు అందించామని, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు.

పేదల సొంతింటి నిర్మాణాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 4.5 లక్షలు ఇండ్లు మంజూరు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3500 పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, 4 విడతల్లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తు న్నామని, ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులలో అర్హులైన పేదలందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు.

సంక్షేమ హాస్టల్స్ లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జెస్ పెంచడం జరిగిందని అన్నారు.

అనంతరం కూసుమంచి మండలం జీళ్ల చెరువు ఎం.పి.పి.ఎస్. పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో షూస్, రెండు జతల సాక్స్ లను మంత్రి పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, డిప్యూటీ సిఈఓ నాగపద్మజ, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్ష కిట్లు





**పేదల పక్షపాతిగా రాష్ట్రంలో ప్రజాపాలన**
**కూసుమంచి క్యాంపు కార్యాలయంలో**
**కాటమయ్య కిట్ల పంపిణీలో మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రమాదాల నివారణ కోసం కాటమయ్య రక్షక కిట్లను గీత కార్మికులు తప్పనిసరిగా వినియోగించాలని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి 80 మంది లబ్ధిదారులకు శుక్రవారం కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... కల్లు గీత కార్మికులకు పూర్తి స్థాయిలో కాటమయ్య రక్షక కిట్లను అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల, కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.

ఈత చెట్లు ఎక్కే సమయంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా సాంకేతికంగా, శాస్త్రీయంగా కాటమయ్య రక్షక కిట్లను తయారుచేయడం జరిగిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామని అన్నారు. రైతులకు మద్దతుగా 21 వేల కోట్లతో 2 లక్షల వరకు పంట రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన రేషన్ కార్డు సమస్యలను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరించి 7 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని అన్నారు. పేదలకు అండగా ఉండే మన ప్రభుత్వం మొదటి విడత నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని అన్నారు. రాబోయే రోజులలో ప్రతి ఒక్క అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గీత కార్మికుల సమస్యల తొలగించేందుకు ప్రభుత్వం భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, కూసుమంచి మండల తహసీల్దార్ రవి కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# చిల్కానగర్–ఉప్పల్ రోడ్డుపై బాక్స్ కల్వర్టు పనులు పూర్తి: కార్పొరేటర్ పర్యవేక్షణ

**చిల్కానగర్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

చిల్కానగర్-ఉప్పల్ ప్రధాన రహదారిపై నెల రోజులుగా జరుగుతున్న బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ పనులను చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కల్వర్టు పనులు సుమారు 17 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టబడినట్లు ఆమె తెలిపారు. బీరప్పగడ్డ, శ్రీనగర్ కాలనీ మరియు పరిసర ప్రాంతాల నుండి వర్షాకాలంలో తరచూ పేరుకు పోయే వర్షపు నీటిని ఇరిగేషన్ నాలాలోకి మళ్లించి శాశ్వత పరిష్కారం అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు వివరించారు.

పనులు కొనసాగుతున్న సమయంలో వర్షాలు విరివిగా కురవడంతో నిర్మాణం ఆలస్యమైనట్లు కార్పొరేటర్ తెలిపారు. దీని వల్ల ప్రజలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తూ, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ మరియు ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

క్యూరింగ్ ప్రక్రియ, ట్రాఫిక్ సౌలభ్యం

పూర్తయిన కల్వర్టుకు పది రోజుల క్యూరింగ్ అవసరమని, ఇందులో భాగంగా వారం రోజుల్లో రెండు చక్రాల వాహనాలకు రాకపోకలు అనుమతించి, మరుసటి మూడు రోజుల్లో మొత్తం వాహన రాకపోకలకు పూర్తిగా కల్వర్టు ఓపెన్ చేయాలని ఏఈ రాధికకు కార్పొరేటర్ సూచనలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు, కాలనీ సంఘ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సత్తుపల్లి సింగరేణి కాలనీలో భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలు.!

**సత్తుపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి సింగరేణి పి.వి.ఎన్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆరాధనలతో కొనసాగుతున్నాయి. సింగరేణి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిరంతరంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఈ సంవత్సరం వినాయక చవితి సందర్భంగా విగ్రహదాతలుగా తాటిపాముల మోహన్ -సంధ్యారాణి దంపతులు, లడ్డు దాతలుగా కాటరి సంపత్ కుమార్ -నిరంజని దంపతులను కమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు.

కాలనీవాసులు ప్రతిరోజు ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథుని కృపకటాక్షాలు పొందుతున్నారు. మహిళా భక్తులు శ్రద్ధాభక్తులతో కుంకుమపూజలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. రాబోయే సోమవారం మహా అన్నదాన కార్యక్రమానికి అన్ని కాలనీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా కమిటీ విజ్ఞప్తి చేసింది.



# జాతీయ క్రీడా దినోత్సవంలో వ్యాయామ ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

**సత్తుపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు హాజరై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

కార్యక్రమంలో మండల సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయురాలు చిరుమామిళ్ల పద్మావతిని ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.ఎల్.వి. రాంబాబు, బొంతు శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రియాజుద్దీన్, సయ్యద్ సమద్ తదితరులు పాల్గొని ఉపాధ్యాయురాలి క్రీడా రంగ సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర అపూర్వమని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకకు మండల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, పాఠశాల సిబ్బంది సమష్టిగా హాజరయ్యారు.



# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన డా. ఏ.ఎస్. రావు నగర్ ధార్మిక సంఘం నాయకులు

**ఏ.ఎస్. రావు నగర్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలోని డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ ధార్మిక సంఘం నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవంబర్ 2వ తేదీన డా. ఏ.ఎస్. రావు నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో నిర్వహించనున్న సామూహిక కోటి దీపోత్సవ పూజల ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో చర్చించారు. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వచనాలు అందించాలని నేతలు ఎమ్మెల్యేను కోరారు. సంఘం తరపున నాయకులు కోటి దీపోత్సవ పూజల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి సంవత్సరం ఈ పూజలలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని, ఈసారి కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సంఘ నాయకులను అభినందిస్తూ, ప్రభుత్వ స్థాయి నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, భార్గ రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, మురళి పంతులు, సిహెచ్. కృష్ణారావు, కృష్ణమూర్తి, నర్సింగ్ రావు, చంద్ర కుమార్, మల్లికార్జున్ రావు, సూర్య ప్రకాష్, సూర్యనారాయణ, శివ, సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్యాక్స్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరాకు చర్యలు

**యూరియా పంపిణీలో చిన్న అవకతవకలు జరిగినా స్పాట్ లో సస్పెండ్**

**కూసుమంచి క్యాంపు కార్యాలయంలో యూరియా సరఫరాపై సమీక్షించిన మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:**

పాలేరు నియోజకవర్గం పరిధిలో ఇక నుంచి ప్యాక్స్ కేంద్రాల ద్వారా మాత్రమే రైతులకు యూరియా సరఫరా జరగాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి యూరియా సరఫరాపై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....ఏప్రిల్ నెల నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన స్థాయిలో యూరియా సరఫరా చేయని కారణంగా కొంత యూరియా కొరత మన రాష్ట్రంలో ఉందని అన్నారు. రామగుండం ఆర్.ఎఫ్.సి.ఎల్. ఉత్పత్తి సాంకేతిక సమస్యల వల్ల నిలిచిపోయిందని అన్నారు. ఖమ్మం జిల్లాకు రాబోయే 7 రోజులలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వస్తుందని అన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో ప్యాక్స్ సోసైటిల ద్వారా మాత్రమే రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా క్రమ పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. యూరియా పంపిణీలో ఎటువంటి తప్పులు జరగరాదని అన్నారు. గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా అమ్మినట్లు రిపోర్టు ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో సమస్య ఉండటం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అమ్మకం యూనిట్లను పెంచాలని, సహకార శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బందిని డిప్యూటేషన్ లో తీసుకోవాలని, పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని, రైతులకు నేరుగా యూరియా అందించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఇక నుంచి ప్రైవేటు రంగానికి యూరియా బ్యాగ్ ఇచ్చే ఆస్కారం లేదని, వ్యవసాయ సహకార సంఘాల నుంచి అదనపు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేయాలని, సెప్టెంబర్ సీజన్ ముగిసే వరకు యూరియా అమ్మకాలకు అనుమతిస్తూ టెంపరరీ లైసెన్సులు జారీ చేయాలని అన్నారు. యూరియా పంపిణీలో ఎవరైనా చిన్న అవకతవకలకు పాల్పడిన స్పాట్ లో సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి స్పష్టం చేశారు. ప్రతి సబ్ సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. యూరియా పంపిణీ పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్ అధికారినీ నియమించాలని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సాయి బాబా నగర్‌లో ఘనంగా గణపతి పూజ

**కాప్రా, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)**

కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ భూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి పూజా మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్‌మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్‌ను సంఘ సభ్యులు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా విట్టల్ నాయక్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి, యువత ప్రగతి కోసం సంఘాలు ముందుకు రావడం హర్షణీయం అన్నారు. గణపతి పూజ శాంతి, సౌభాగ్యం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత సామాజిక సేవలో చురుకుగా పాల్గొని ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మౌనిర్టీ డివిజన్ నాయకుడు ముర్తజా, రియాజ్, ఎం. ప్రదీప్, రాజేందర్ సింగ్, సర్జన్ భుల్, జితాధేర్ సింగ్, కిరణ్ సింగ్, రాజేష్ సింగ్, భరత్ సింగ్, సురేష్ సింగ్, రతన్ సింగ్, పవన్ సింగ్, హర్షా సర్కి, మధు కుమార్, ప్రకాష్ సింగ్, రాహుల్ సింగ్, రూపేష్ సింగ్, కార్తీక్ సింగ్, రితిక్ భుల్, లోకేష్ సింగ్, జాన్సన్, సంతోష్ భూల్, చేతన్ సింగ్, మనీష్ సింగ్, పృధ్వీరాజ్, దేవాన్ష్, దినేష్, శివం, సాధమ్ తదితరులు పాల్గొని యూత్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను అభినందించారు. స్థానిక ప్రజలు, సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.





# జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో ఎంపీ డా. కడియం కావ్య

**హన్మకొండ,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపి కావ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడా కారులను ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపడుతోందని ఎంపీ తెలిపారు. వరంగల్‌లో స్పోర్ట్స్ స్కూల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని, త్వరలో ఉమ్మడి జిల్లాకు క్రీడా పాఠశాలతో పాటు అంతర్జాతీయ ప్రమాణాల క్రికెట్ స్టేడియం మంజూరు కానున్నదని వెల్లడించారు. స్పోర్ట్స్ స్కూళ్లలో విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ పొందే అవకాశం లభించడం వల్ల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కూడా మంచి ఉద్యోగావకాశాలు దక్కుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి అశోక్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.





# ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:**

**తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో మంత్రి శుక్రవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా వెంకటగిరి ప్రాంతంలో 33/11 కె.వి. సబ్ స్టేషన్, చింతపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... వెంకటగిరి లో రూ. 2 కోట్ల 55 లక్షల రూపాయలతో చేపట్టిన మిని స్టేడియం నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామని అన్నారు. తాజాగా రూ. 2 కోట్ల 50 లక్షల రూపాయలతో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసు కున్నామని అన్నారు.

ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలో ఒక కోటి 10 లక్షలతో నిర్మించనున్న చింతపల్లి నుండి ఖమ్మం వరంగల్ హై వే రోడ్డు నిర్మాణానికి, ఒక కోటి 43 లక్షలతో నిర్మించనున్న చింతపల్లి నుండి తిరుమలాయపాలెం ఆరేకోడు బీటీ రోడ్డు నిర్మాణానికి తాజాగా శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గడిచిన ఇరవై నెలల కాలంలో ఇందిరమ్మ రాజ్యంలో చింతపల్లి గ్రామానికి దాదాపు రూ. 24 కోట్ల 74 లక్షల రూపాయలు అభివృద్ధి కోసం మంజూరు చేశామని అన్నారు.గ్రామంలో బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, పెండింగ్ ఉన్న రోడ్లు, పాఠశాల అభివృద్ధి పనులకు నిధులను విడతల వారిగా మంజూరు చేసి పూర్తి చేసే బాధ్యత తనదని మంత్రి తెలిపారు. పేదలకు ఇండ్ల స్థలాలు అందించే అవకాశాన్ని పరిశీలించి అర్హులకు చేరేలా చూడాలని మంత్రి రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ 200 యూనిట్ల ఉచితవిద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా సహాయం 12 వేలకు పెంపు, సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతిల్లు అందించే పథకం నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వం 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు.అనంతరం 56 మందికి కల్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ రాం ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# నిత్యాన్నదానం.. భక్తి నృత్యోత్సవాలతో కళకళలాడుతున్న ప్రసన్న గణపతి

**సత్తుపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి శివారులోని రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో గల ప్రసన్న గణపతి ప్రాంగణం గణనాథుని నవరాత్రి ఉత్సవాలతో పవిత్ర క్షేత్రంగా మారింది. 23 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రతిరోజూ భక్తి జ్వాలలను రగిలిస్తున్నాయి.

ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే నిత్యాన్నదానంలో భక్తులందరికీ అన్నప్రసాదం అందిస్తున్నారు. దాతల సహకారం, వంట మేస్త్రుల ఉచిత సేవలు, భక్తుల అంకితభావం కలగలిపి ఈ విశిష్ట సేవ కొనసాగుతుంది.

ఉత్సవాల్లో భాగంగా చెడుకు తావులేని సాంస్కృతిక నృత్యోత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రస్మా ఆధ్వర్యంలోని పాఠశాలలు ప్రతిరోజూ కూచిపూడి, జానపదం, దేశభక్తి నృత్యాలతో ఆధ్యాత్మికతను, నైతిక విలువలను పంచుతున్నాయి.

భజనలు, సంకీర్తనలు, మాలధారణ భక్తుల ఆరాధనతో ప్రాంగణం నిత్యం గానమయమవుతోంది. గణపతి మాలధారణ చేసిన సుమారు 100 మంది భక్తులు సేవకులుగా నిరంతరం సహకరిస్తుండటం విశేషం.

ఈ నవరాత్రులు కేవలం ఆరాధనకే కాక, భక్తి, భోజన ప్రసాదం, సాంస్కృతిక విలువల సమ్మేళనంగా ప్రసన్న గణపతి క్షేత్రంలో భక్తులను ఆకర్షిస్తున్నాయి.





# విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**కెజిబివి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర**

**న్యూ లక్ష్మీపురం కేజీబీవీ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కెజిబివి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర అన్నారు. ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, న్యూ లక్ష్మీపురం కెజిబివి పాఠశాలలో శుక్రవారం భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారు ఇందిరా మాట్లాడుతూ... జాతీయ క్రీడా దినోత్సవంను భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ పుట్టిన రోజైన ఆగష్టు 29న జరుపుకుంటారన్నారు. ఈ దినోత్సవమును భారతీయ క్రీడాకారులు ప్రతి సంవత్సరం వేడుకగా జరుపుకుంటారన్నారు. ధ్యాన్ చంద్ తన జట్టుతో మూడు ఒలింపిక్ బంగారు పతకాలు సాధించి భారతదేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని కొనియాడారు. అందుకే ధ్యాన్ చంద్ భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించబడ్డాడన్నారు. గొప్ప క్రీడాకారుడుగా పేరు తెచ్చుకున్న ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా భారతీయ క్రీడాకారులు ప్రతి సంవత్సరం అతని జయంతి రోజు ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవమును జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి రజిని, ఎండి సఫియా, యాస్మిన్, సుజాత, సుమలత, కవిత, పి స్వాతి, బి నిర్మల, డి నాగలక్ష్మి, కె సుకన్య, సిహెచ్ రాధా, జ్యోతి, ఉమాదేవి, రేణుక, పిఈటి పి సునీత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్‌లో ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

**ఎరువుల దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ కరువు**

**అధికారుల అండదండలతోనే యూరియా అక్రమ దందా అని రైతుల ఆరోపణ**




**పెద్దమందడి,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం వెల్టూర్‌లోని శ్రీ రామలింగేశ్వర ఫర్టిలైజర్ దుకాణం పై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ సిఐ గణేష్, జీఎస్టీ అధికారి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 250 యూరియా బస్తాలను అక్రమంగా విక్రయించినట్లు గుర్తించారు.

అధికారుల సమాచారం ప్రకారం, ఒక్కో బస్తాను రూ.300 చొప్పున రైతులకు అమ్మినట్టు తేలింది. సకాలంలో సబ్సిడీ ధరకు యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దుకాణదారులు అక్రమ దందాలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

దాడుల్లో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్వాయిసులు, లైసెన్స్ కాపీలు, ఈమిషన్లు స్వాధీనం చేసుకున్నారు. అధిక ధరలకు యూరియా విక్రయించినందుకు సంబంధిత దుకాణంపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ చర్యల్లో అగ్రికల్చర్ ఏడి ప్రభాకర్ రెడ్డి, ఏవో సైదులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక చవితి వేడుకల్లో అప్రమత్తత తప్పనిసరి

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు డిఎస్ మహేష్**

**పెద్దమందడి,ఆగస్టు29 (తెలంగాణ ముచ్చట్లు):**

వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణనష్టానికి దారి తీస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డి.ఎస్. మహేష్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ, "తొమ్మిది రోజులపాటు విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ఈ వేడుకల్లో ఆనందంతో పాటు అప్రమత్తత అవసరం" అని అన్నారు.

ఇటీవల హైదరాబాద్‌లో కృష్ణాష్టమి శోభాయాత్రలో విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు మృతి చెందిన ఘటన, అలాగే పాతబస్తీ బండ్లగూడలో వినాయక విగ్రహం తరలింపులో విద్యుదాఘాతం కారణంగా ఇద్దరు మరణించడం చాలా బాధాకరమని మహేష్ పేర్కొన్నారు.

మండప నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించిన ఆయన, రాత్రి వేళల్లో ఒకరు తప్పకుండా మండపం వద్ద ఉండాలని, వినాయక నిమజ్జనం చేసే చెరువుల దగ్గర సురక్షిత దారులు, సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

"తొందర వద్దు - శోకం మిగల్చొద్దు. జాగ్రత్తలు తీసుకుంటే వినాయక చవితి పండుగ సజావుగా, సంతోషంగా జరుగుతుంది" అని కాంగ్రెస్ నేత మహేష్ ఆకాంక్షించారు.

# వినాయక పూజలో అక్షిత కొత్త కమిటీ సభ్యులు



**మల్కాజ్గిరి: ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)**

అక్షితలో ఇటీవల ఏర్పాటు చేసిన నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రత్యేకంగా వినాయక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన కమిటీ ఆరంభోత్సవానికి ప్రతీకగా గణనాథుడిని ఆహ్వానించి పూజలు చేశారు.



ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయి కిరణ్-స్వప్న దంపతులు ప్రధాన అతిథులుగా పాల్గొని, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం సెట్టి, విశాల్, మహేష్‌తో పాటు ఇతర సభ్యులు కూడా హాజరై గణనాథుడి ఆశీర్వాదం పొందారు.

వినాయక పూజ అనంతరం కమిటీ సభ్యులు పరస్పర అభినందనలు తెలియజేసుకుని, సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక నివాసులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బాబురెడ్డి నగర్‌లో ఘనంగా వినాయకుడి కటాక్షం కోసం కుంకుమ పూజ

**నాగారం, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

నాగారం మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో బాబురెడ్డి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, "వినాయక చవితి సందర్భంగా కుంకుమ పూజ చేయడం ద్వారా కుటుంబంలో ఐశ్వర్యం, సుఖశాంతులు నెలకొంటాయని విశ్వాసం ఉంది. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో స్నేహసంబంధాలు, ఐక్యతను పెంపొందిస్తాయి. ప్రతి ఏడాది మరింత ఉత్సాహంగా జరగాలని మా ఆకాంక్ష" అని తెలిపారు.

మంత్రోచ్చారణల నడుమ వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాన్ని అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఘట్కేసర్ తాసిల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**మేడ్చల్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)**



మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఘట్కేసర్ తాసిల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.తనిఖీలో భాగంగా ఆయన రెవిన్యూ సదస్సు, భూభారత సదస్సులో సమర్పించిన దరఖాస్తులు, వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ప్రజలు చేసిన అభ్యర్థనలను పరిశీలించారు. సంబంధిత ఫైళ్లు క్షుణ్ణంగా పరిశీలించిన విజయేందర్ రెడ్డి, ప్రజలకు సమయానికి సేవలు అందించడంలో ఎలాంటి విళంబం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే, పెండింగ్ ఫైళ్లు వెంటనే క్లియర్ చేయాలని, పరిపాలనా లోపాలు లేకుండా చూసుకోవాలని తాసిల్దార్ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టే విధంగా సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేసి పారదర్శకతను కాపాడాలని పలు సూచనలు చేశారు. తనిఖీ అనంతరం ఎమ్మార్వోతో క్షేత్రస్థాయి సమస్యలపై చర్చలు జరిపి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.తరువాత ఆయన ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ రాజేష్‌తో కలిసి ఎదలబాద్ చెరువులో జరుగనున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సమయంలో భద్రత, శానిటేషన్, ట్రాఫిక్ సౌకర్యాలు వంటి అంశాలపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తాసిల్దార్ రజని, డిప్యూటీ తాసిల్దార్ రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, సర్వేయర్ రూప, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బేతుపల్లి చెరువు ఘాట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన!

**సత్తుపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

గణేష్ నవరాత్రులు అనంతరం జరగబోయే గణనాథుని నిమజ్జన కార్యక్రమం సజావుగా, సురక్షితంగా జరిగేలా బేతుపల్లి చెరువు ఘాట్ వద్ద ఏర్పాట్లను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ స్వయంగా పరిశీలించారు. చెరువు ప్రస్తుత పరిస్థితులు, అలుగు స్థితి తదితరాలను పరిశీలిస్తూ ప్రజల భద్రతే ప్రధానం కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివా వేణు, దొడ్డా శ్రీను, అప్పారావు, సాయిలు, జయరాజు, సుభాని, శ్రీను తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు గణనాథుని నిమజ్జనం సందర్భంగా జాగ్రత్తలు పాటించి, అధికారుల సూచనలను అనుసరించాలని పిలుపునిచ్చారు.




## ఘనపూర్‌లో నూతన ఎస్సైకి రవినాయక్ సన్మానం

**ఘనపూర్,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):**

ఘనపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై వల్లూరు వెంకటేష్ ను జిల్లా దిశ కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకులు ముడవత్ రవి నాయక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ సహకరిస్తామని అన్నారు. ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ, మండల ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలు, ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తూనే, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 ద్వారా సహాయం పొందవచ్చని ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నరసింహ సరస్వతి నగర్ వినాయక మండపంలో బిఆర్ఎస్ నేతల ఆధ్వర్యంలో అన్నదానం

**నాచారం, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంలో నాచారం డివిజన్ నరసింహ సరస్వతి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి భావంతో ప్రసాదం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిజన్ శేఖర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక ప్రజలకు అన్నసమారాధన అందించడం ద్వారా వినాయకుడి ఆశీస్సులు అందాలని కోరుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కాలనీవాసులు, బిఆర్ఎస్ కార్యకర్తలు విశేషంగా సహకరించారు.

## డేర్ అధ్యక్షులు డా అన్వర్‌ను కలిసిన జమాతే ఇస్లామీ హింద్ బృందం

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:**



డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ ది రిలీఫ్ అండ్ ఎడ్యుకేషనల్ ( డేర్ ) అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన డాక్టర్ అన్వర్ ను జమాత్ ఇస్లామిక్ బృందం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.డేరా ఆధ్వర్యంలో పేదల కోసం మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహించాలని మరియు మెడిసిన్ చదువుతున్న విద్యార్థులకు సరైన సూచనలు సలహాలు అందించాలని సూచించారు. గతంలో కూడా డేర్ నిర్వహించిన మెడికల్ క్యాంపులు, వరద బాధితులకు సహాయ సహకారం పేదలకు చాలా ఉపయోగపడ్డాయి అన్నారు మీరు నిర్వహించే కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ పూర్తి సహకారం అందిస్తుంది అన్నారు ఈ బృందంలో జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా , ఉపాధ్యక్షులు అబ్దుల్ సమీ, మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్ పాల్గొన్నారు..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## బీబీనగర్ చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన రాచకొండ కమిషనర్

మేడ్చల్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)

గణేష్ నిమజ్జన మహోత్సవం నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ శనివారం బీబీనగర్ పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమం కోసం చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలను ఆయన సమీక్షించారు. పోలీస్ సిబ్బంది, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సరైన రహదారి మార్గదర్శక బోర్డులు, లైటింగ్ సదుపాయాలు, రక్షణ చర్యలు, ట్రాఫిక్ డైవర్షన్లు సమర్థవంతంగా ఉండాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్ద ఎత్తున భక్తులు, గణేష్ మండప నిర్వాహకులు నిమజ్జనానికి వస్తారని భావించి తగిన భద్రతా ఏర్పాట్లతో పాటు నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.

ఈ సందర్శనలో భువనగిరి డీసీపీ ఆక్షాన్ష్ యాదవ్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రాహుల్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి, బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ భువనగిరి సీఐ మధుసూదన్ రెడ్డి, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపై వుంది

**అతి ప్రాచీన ద్రావిడ భాషల్లో అత్యంత ప్రధానమైన భాష మన తెలుగు భాష.**

**పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ.**

హసన్ పర్తి, ఆగష్టు 29(తెలంగాణ ముచ్చట్లు):

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ హసన్ పర్తి కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ మాట్లాడుతూ అతి ప్రాచీన ద్రావిడ భాషల్లో అత్యంత ప్రధానమైన భాష మన తెలుగు భాష అని సుమారు 8 కోట్ల మందికి మాతృభాష అని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ,యానాం రాష్ట్రాల అధికార భాషగా ఉందని తెలిపారు.దేశ భాషలందు తెలుగు లెస్స అన్న శ్రీకృష్ణదేవరాయలు కాలం నుండి ఆదికవి నన్నయ,పోతన నేటి ఆధునిక కవులైన దాశరథి కృష్ణమాచార్య డాక్టర్ సి.నారాయణరెడ్డిల వరకు తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయిలో ఎనలేని ప్రాధాన్యం కల్పించినారని కానీ నేడు పాఠశాలలో ఆంగ్ల భాష మోజులో పడి అమ్మ భాష అయినా మన తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గించడం జరుగుతుందని దానివలన మన తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్య భాషలు ఎన్ని నేర్చుకున్నా మన మాతృభాషను మర్చిపోవద్దు. మన మాతృభాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్లేనని మన సంస్కృతి విలువలు సాంప్రదాయాలతో మంచి అనుబంధం మాతృభాషతోనే ఏర్పడుతుందని తెలిపారు. కాబట్టి తెలుగు భాష కనుమరుగైగిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపైఉందన్నారు.అందుకే మన పాఠశాలలో అనేక పర్యావరణహిత విద్యా కార్యక్రమాలలో భాగంగా ఈ సంవత్సరము మన అమ్మ భాష అయినా తెలుగు భాషను పరిరక్షించడానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపినారు. విద్యార్థులచే తెలుగు భాషను నేర్చుకుందాం తెలుగులోనే మాట్లాడుకుందాం అని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ,ఉపాధ్యాయులు జూపాక నాగరాజు,రాధాకుమారి,అచ్యుత్ రెడ్డి,అరుణ, సుచిత్ర,సిహెచ్.సంధ్య,జి.సంధ్య,ప్రవళిక,సరిత, దేవిక,అఖిల తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ ను సన్మానించిన

## తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యులు

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29, తెలంగాణ ముచ్చట్లు:



ఇటీవల ఖమ్మం జిల్లా ఆహా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ ముజాహిద్ ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మైనార్టీ సంక్షేమ శాఖ ఛాంబర్ లో తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పూల మాల వేసి , శాలువా కప్పి , సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకులు ఎస్కే. నజీరుద్దీన్ , ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్.కె. హసన్ ( ముష్టికుంట్ల ) , గౌరవ అధ్యక్షులు నేరడ హసన్ , ఉపాధ్యక్షులు తుటికుంట్ల ఖాసీం ,జిల్లా ప్రధాన కార్యదర్శి జానీ మియా , జిల్లా కార్యదర్శి అఫ్జల్ , పల్లిపాడు పాష, కార్యవర్గ సభ్యులు మన్సూర్ అలీ , చింతకాని మండల అధ్యక్షులు ఇమామ్, నేలకొండపల్లి అధ్యక్షులు ఎస్.కె . సోనియా , నాయకులు అమీరు , శ్రీరామగిరి జానీ మియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారి మహమ్మద్ ముజాహిద్ కు అభినందనలు తెలిపారు.






## తిరుమలగిరిలో 36వ ప్రాంతీయ స్థాయి యువ పార్లమెంటు పోటీలు ఘనంగా

సికింద్రాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):

సికింద్రాబాద్ తిరుమలగిరిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం వేదికగా 36వ ప్రాంతీయ స్థాయి యువ పార్లమెంటు పోటీలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది కేంద్రీయ విద్యాలయాల నుండి 480 మంది విద్యార్థులు పాల్గొని తమ చర్చా నైపుణ్యాలు, పార్లమెంటరీ ప్రవర్తనను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుకట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హాజరై విద్యార్థులకు ప్రేరణ నిచ్చారు. ఈ పోటీలు యువత స్వరాన్ని ప్రతిబింబిస్తూ ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావనలను పెంపొందించడంలో సహకరిస్తాయని ఆయన అన్నారు.ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్ ముఖ్య అతిథిని స్వాగతం పలికారు. పోటీల్లో పికెట్, గచిబౌలి, గోల్కొండ2, శ్రీనగర్1, ఒంగోలు, నెల్లూరు, కంచన్‌బాగ్ కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎమ్‌టి ప్రత్యేకంగా రూపొందించింది. హైదరాబాద్ కెవిఎస్ ఆర్ఓ అసిస్టెంట్ కమిషనర్ పి. అనురాధ, బోలారం కెవి ప్రిన్సిపాల్ వీనా రోట్ విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


## కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో గణపతి పూజ ఘనంగా

కుషాయిగూడ, ఆగస్ట్ 29 (తెలంగాణ ముచ్చట్లు)

రాచకొండ కమిషనరేట్ పరిధిలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గణపతి పూజా వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్టేషన్ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో సి ఐ భాస్కర్ రెడ్డి పూజా కార్యక్రమాలకు నేతృత్వం వహించారు.ఈ కార్యక్రమానికి ఏసీపీ వెంకట్ రెడ్డి ప్రధాన అతిథిగా విచ్చేసి గణనాథుని ఆశీర్వచనాలు పొందారు. ఎస్ఐలు వెంకన్న, సుధాకర్, శ్రీనివాస్, సాయిలుతో పాటు పోలీస్ సిబ్బంది, డివిజన్ 2 గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ నీరుకొండ సతీష్ బాబు, కోకన్వీనర్లు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో సాంప్రదాయ రీతిలో వేద మంత్రోచ్ఛారణల నడుమ గణనాథుని అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం నిర్వహించి, సామాజిక సౌహార్దం, ఐకమత్యం ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని శోభాయమానంగా ముగించారు.



## రాష్ట్రపతి చేతుల మీదుగా ఈసీఐఎల్ సిఎండీకి స్కోప్ ఎమినెన్స్ అవార్డు

### వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్‌లో అగ్రగామిగా ఈసీఐఎల్ ప్రతిభకు జాతీయ గుర్తింపు

మేడ్చల్ మల్కాజ్గిరి, ఆగస్ట్ 29 (తెలంగాణ ముచ్చట్లు)

దేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 202223 సంవత్సరానికి చెందిన ప్రతిష్ఠాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) సంస్థ ఇన్స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ విభాగంలో అవార్డుకు ఎంపికై విశిష్ట గుర్తింపు పొందింది.

ఈ అవార్డును దేశ గౌరవప్రదమైన భారత రాష్ట్రపతి స్వయంగా అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసీఐఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండీ) అనురాగ్ కుమార్, ఓఎస్ & టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనేష్ కుమార్ శర్మతో కలిసి వేదికపైకి వెళ్లి అవార్డును స్వీకరించారు.

ఈ సందర్భంగా అనురాగ్ కుమార్ మాట్లాడుతూ, "ఈ అవార్డు మా సంస్థ ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్తుంది. వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశ స్వావలంబన సాధన కోసం మా కృషి నిరంతరం కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సిపిఎస్ఈ సామాజిక బాధ్యత, ఆర్థిక నిర్వహణ, కార్పొరేట్ పాలనలో చూపుతున్న ప్రతిభకు ఈ అవార్డు గుర్తింపుగా నిలుస్తోంది. అణుశక్తి శాఖ డిఏఈ నినాదం 'దేశ సేవలో అణువు కు అనుగుణంగా మా కృషి కొనసాగిస్తాం," అని తెలిపారు.

ఈ అవార్డు ద్వారా ఈసీఐఎల్ దేశీయ సాంకేతిక పురోగతిలో అగ్రగామిగా నిలిచిన విషయం మరోసారి రుజువైంది. రక్షణ, అణుశక్తి, అంతరిక్షం, కమ్యూనికేషన్, భద్రతా రంగాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో దేశ అభివృద్ధికి ఈసీఐఎల్ చేస్తున్న కృషిని అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలు సిపిఎస్ఈ ల సీనియర్ అధికారులు, మంత్రిత్వశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాలు మారిన అభివృద్ధి సూన్యం

### వర్షాలు పడితే పూర్తిగా చిత్తవుతున్న రోడ్

హసన్ పర్తి,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సుదనపల్లి,నాగారం గ్రామాల మధ్యలో గల రోడ్డు అకాల వర్షాలకు గుంతల మయమై ప్రమాద కరంగ మారిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గుంతల మాయమైన రోడ్డుపై ప్రయాణించడం ఓ పెద్ద సవాలుగా మారిందని గుంతలతో నిండిపోయిన రోడ్డు వర్షాకాలంలో మరింత దారుణంగా మారడంతో, గ్రామస్తులు వాహన దారులు తీవ్ర ఇబంధులు ఎ దుర్కుంటూన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారేది ప్రభుత్వాలు మాత్రమేనని అభివృద్ధి మాత్రం శూన్యం అని గ్రామస్తులు అంటున్నారు. మారేది ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మాత్రమేనని గ్రామాలలోని రోడ్లు మారడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా నాయకులు, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరారు.





## కాజీపేట్ జంక్షన్‌లో గంజాయిని పట్టుకున్న పోలీసులు

కాజీపేట్ ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)

కాజీపేట్ జంక్షన్ లో రైల్వేపోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒకటో నెంబర్ ప్లాట్ఫారం పై అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల వద్దనున్న బ్యాగులను తనిఖీ చేయగా వాటి నుండి 36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు నిందితులను విచారించగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులైన ధరంధీర్ నాయక్, రామ బెహరా, నమిత బెహరా అనే వ్యక్తులు ఒరిస్సా నుండి మహారాష్ట్రలోని దాదరుకు గంజాయిని రవాణా చేస్తున్నట్లు వారు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. 32 కిలోల గంజాయి విలువ సుమారు 16 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వారినుండి గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లను, ప్రయాణం టికెట్లు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. గంజాయి సరఫరా దారులను కోర్టులో హాజరు పరచినట్లు వారు తెలిపారు గంజాయిను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ ఎస్ఆర్పి ఎం. అభినవ్ ఆర్ పి ఎస్ సిబ్బందిని రైల్వే ఎస్పి జి. చందన, డి.ఎస్.పి కృపాకర్ లు అభినందించారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# జె.వి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.!

**సత్తుపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి జె.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. తెలుగు విభాగాధిపతి డా. చీపు పూర్ణ చంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి మాతృభాష ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. మాతృభాషపై పట్టు సాధించడం ద్వారా విద్యలోనూ, వ్యక్తిత్వ వికాసంలోనూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. వ్యవహారిక భాషా ఉద్యమాన్ని విజయవంతం చేసిన గిడుగు రామ్మూర్తి పంతుల గారి కృషి ఎప్పటికీ మరువరానిదని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డా. ఒ. చెన్నారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో సిబ్బంది నియామకానికి కేంద్రం ఆమోదం

### వరంగల్ ఎంపీ కృషికి ఫలితం

### ఉద్యోగుల డిమాండ్‌పై పలుమార్లు కేంద్రమంత్రులను కలసిన ఎంపీ ప్రయత్నం విజయవంతం



**హనుమకొండ, ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ సీజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని కోసం నిరంతరం కృషి చేసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పట్టుదల ఫలించింది. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు, అందులో సిబ్బంది నియామకంపై ఎంపీ పలుమార్లు కేంద్రమంత్రులను కలసి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం వరంగల్ వెల్‌నెస్ సెంటర్‌లో సిబ్బంది నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సెంటర్‌లో 13 మంది సిబ్బంది నియమించనున్నారు. వీరిలో డాక్టర్లు, నర్సులు, ఫార్మసిస్ట్‌లు, అటెండెంట్లు మరియు ఇతర సిబ్బంది ఉంటారని ఎంపీ తెలిపారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై వరంగల్‌లోనే సదుపాయం లభించనున్నదని ఎంపీ స్పష్టం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఈ సెంటర్ మరింత ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు. వరంగల్‌తో పాటు దేశవ్యాప్తంగా కొత్తగా 22 సీజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం మొత్తం 286 పోస్టులకు అనుమతి లభించగా, మొదటి దశలో 88 పోస్టులకు మంజూరు ఇవ్వబడింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



## కమిషనర్ సుధీర్ బాబు ఎదులాబాద్ చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**మేడ్చల్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)**

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ శుక్రవారం ఎదులాబాద్ చెరువును సందర్శించి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించే నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు విస్తృతంగా చేసిన ఏర్పాట్లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. చెరువు పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్రేన్లు, సీసీ కెమెరాలు, లైటింగ్ సౌకర్యాలు, బారికేడ్లు, వాహన పార్కింగ్ సదుపాయాలు తదితర భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. భారీగా తరలివచ్చే భక్తులు మరియు వాహనాల రాకపోకలు సజావుగా జరిగేలా ట్రాఫిక్ డైవర్షన్లు, సిబ్బంది మోహరింపు వంటి చర్యలపై కూడా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "నిమజ్జన కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకున్నాం. పౌరులు పోలీసు సిబ్బందికి సహకరించి ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలి" అని సూచించారు. పరిశీలన కార్యక్రమంలో రాచకొండ ట్రాఫిక్ డీసీపీలు, స్థానిక ఏసీపీలు, సీఐలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కళాశాల అభివృద్ధి నా వంతు బాధ్యత.!

### రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి

**వేంసూరు, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

నాకు విద్యాబుద్ధులు నేర్పిన కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి చేయడం నా వంతు బాధ్యత అని రాజ్యసభ సభ్యులు, హెటిరో డ్రగ్స్ అధినేత డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి వచ్చిన ఆయనను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, అధ్యాపక బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం స్పాన్సర్ చేసిన కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అదే విధంగా బైపిసి చదువుతున్న విద్యార్థులకు ఉచిత నర్సింగ్ సీట్లు కల్పిస్తామని వెల్లడించారు. బండి సోమకాంతం కళాశాలలో చదివిన విద్యార్థులకు చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కళాశాలలో మౌలిక వసతుల గురించి ప్రిన్సిపాల్ అడిగిన విషయాలను వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాను చదువుకున్న సత్తుపల్లి జూనియర్ కళాశాలకు లేని సౌకర్యాలను కందుకూరు కళాశాలలో ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు.

నా జీవితానికి విద్యాబుద్ధులు నేర్పిన కళాశాలను అభివృద్ధి చేయడం నా కర్తవ్యం అని పార్థసారథిరెడ్డి ప్రకటించారు.



## చదువుతోనే సమాజంలో గౌరవం – హర్షితకు ఆర్థిక సహాయం

**సత్తుపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

చదువే సమాజంలో గౌరవాన్ని తెచ్చేది అని సత్తుపల్లి మాల మహానాడు బాధ్యులు పేర్కొన్నారు.

వేంసూరు మండలం దుద్దేపూడి గ్రామానికి చెందిన పూరేటి వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతుల కుమార్తె హర్షిత, ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన సందర్భంగా సత్తుపల్లి మాల మహానాడు బాధ్యులు ఆమెకు ఇరవై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

ఈ సందర్భంలో బాధ్యులు హర్షితకు చదువులో ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్తులో మంచి ఉద్యోగం సంపాదించి పేద ప్రజలకు అండగా నిలవాలని శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో న్యూస్టార్ ఆసుపత్రి వైద్యుడు డా. సురేష్ రామాల, లైబ్రేరియన్ నక్కా మల్లిఖార్జునరావు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు యనమాల విజయ్, మాల మహానాడు బాధ్యులు పిల్లి మల్లిఖార్జునరావు, పిల్లి సురేష్ కుమార్, కోపల్లి రత్తయ్య, పిల్లి వెంకటేశ్వరరావు, నక్కా మోహనరావు, కటుకూరి కృష్ణ, బల్లెం చిరంజీవి, సాలి పవన్, పప్పుల లక్ష్మీ నారాయణ, మైఖేల్, గుంట్రు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## నాగారం-యన్నంపేట రహదారి పనులపై ప్రధాన కార్యదర్శి జోక్యం

**మాజీ ఛైర్మన్ చంద్రారెడ్డి ఫిర్యాదు, రెండు రోజుల్లో సమీక్ష ఆదేశాలు**

**నాగారం, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్ నియోజకవర్గం నాగారం నుండి యన్నంపేట వరకు జరుగుతున్న ప్రధాన రహదారి అభివృద్ధి పనులు నెలల తరబడి నత్తనడకన సాగుతున్నాయని, ఈ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని మాజీ మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ (ఎంఏ& యుడి) అధికారులను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇలంబర్తి ఐఏఎస్‌ను ఆయన కలిశారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే పరిస్థితి ఏర్పడింది. పూర్తి చేయాల్సిన గడువు దాటి నెలలైపోయినా రహదారి పనులు ముందుకు సాగడం లేదు. నాగారం మున్సిపాలిటీ ప్రజలకు ఇది ప్రాణాధారంగా ఉన్న రహదారి. వెంటనే పనులు పూర్తి చేయాలి అని చంద్రారెడ్డి విన్నవించారు.

ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ప్రధాన కార్యదర్శి, సంబంధిత సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను ఫోన్‌లో సంప్రదించి రెండు రోజుల్లోనే పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. అదేవిధంగా హెచ్ఆర్డిసిఎల్ అధికారులను కూడా చంద్రారెడ్డి ప్రత్యేకంగా కలిశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, రామక్కపేట రవీందర్ రెడ్డి, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడికి మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ప్రజలందరూ అభివృద్ధికి భాగస్వాములై అధికారులకు, అభివృద్ధికి సహకరించాలి

**హసన్ పర్తి, ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):**

వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని రెడ్డిపురం గ్రామంలో విజయలక్ష్మి కాలనీ నుంచి సాయి కృప కాలనీ వరకు సాయి కృప కాలనీ నుండి ఎస్సారెస్పీ కెనాల్ వరకు సుమారు రూ.1 కోటి 50 లక్షల GWMC సాధారణ నిధులతో నిర్మించబోయే బీ.టీ రోడ్డుకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని గత కొన్ని సంవత్సరాలుగా రెడ్డిపురం గ్రామంలోని పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, డ్రైనేజీ సమస్యకు ఇది శాశ్వత పరిష్కారం అవుతుందన్నారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని తీసుకురావడానికి మీ అందరి సహకారం అవసరం ఉంటుందని గ్రామ ప్రజల అభ్యర్థనలు, సమస్యలను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు అభివృద్ధికి భాగస్వాములై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవి నాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగిలాల్, ఎనుమాముల ఎఎంసి డైరెక్టర్ రైతు రాజు, హన్మకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, జవహర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## టీపీసీసీ చీఫ్‌ను కలిసిన డాక్టర్ ఆదిత్య రెడ్డి

### మర్యాదపూర్వక భేటీలో పలు అంశాలపై చర్చ



**వనపర్తి, ఆగస్టు29 (తెలంగాణ ముచ్చట్లు):**

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను ఆయన నివాసంలో ఏఐపీసీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ నేషనల్ హెడ్, వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ఆరోగ్య రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి పలు అంశాలపై చర్చ జరిగింది.

ప్రజలతో కలిసిపని చేస్తూ, కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేస్తానని డాక్టర్ ఆదిత్య రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువతకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- **వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**పెద్దమందడి,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):** అభివృద్ధి, సంక్షేమం సాధ్యమయ్యేది కాంగ్రెస్ పాలనలోనే అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా 35 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ. 7.64 లక్షలు, కళ్యాణ లక్ష్మి-షాది ముబారక్ లబ్ధిదారులకు రూ. 38.04 లక్షల చెక్కులు అందజేశారు.
మహిళా సాధికారతపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఆర్టీసీ బస్సుల కొనుగోళ్లు, పాఠశాల దుస్తుల తయారీ, వడ్డీరహిత రుణాలు, డీజిల్ బంకులు, రైస్ మిల్లులు వంటి పథకాలతో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. "ఆరు గ్యారెంటీల్లో పలు పథకాలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి, మిగిలినవీ త్వరలో అమలు చేస్తాం. ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే" అని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూలిన యుద్ధ విమానం.. కాలిబూడిదైన పైలట్

ఎఫ్16 యుద్ధ విమానం కుప్పకూలి ఆర్మీ పైలట్ అక్కడిక్కడే కాలిబూడిదై ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన పోలాండ్ దేశంలోని రాడోమ్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాడోమ్ ఎయిర్ షోలో పోలిష్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్16 ఫైటర్ ఒక్కసారిగా అదుపుతప్పి కూలిపోయింది. జెట్ అతివేగంతో నేలను తాకగానే అందులో ఉన్న ఫ్యూయల్ బయటకు రావడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో ఆర్మీ పైలట్ మృతి చెందారు. ప్రభుత్వ ప్రతినిధి ఆడమ్ ష్లాప్కా, రక్షణ మంత్రి వ్లాడిస్లావ్ కోసినియాక్‌కమిష్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పైలట్ మరణాన్ని కూడా ధృవీకరించారు. ఈ మేరకు కోసినియాక్‌కమిష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పైలట్ అంకితభావం ధైర్యాన్ని కొనియాడుతూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అయితే, ఈ దుర్ఘటనలో వీకెండ్‌లో జరగాల్సిన రాడోమ్ ఎయిర్ షోను రద్దు చేస్తున్నట్లుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. పోలిష్ ఎయిర్‌ఫోర్స్ చరిత్రలోనే ఇది అతి పెద్ద దుర్ఘటన అని వెల్లడిరచింది.

# స్టూడెంట్ వీసా ఇక నాలుగు సంవత్సరాలే

ట్రంప్ అధికార యంత్రాంగం వీసా గడువు కుదింపును తీవ్రతరం చేసింది. విదేశీ విద్యార్థులు, మీడియా సిబ్బంది వీసా కాల పరిమితిని మరింతగా తగ్గించేందుకు రంగం సిద్ధం అయింది. ఇకపై విదేశీ విద్యార్థులు నాలుగు సంవత్సరాలు మించి అమెరికాలో ఉండరాదు. అదే విధంగా సాంస్కృతిక ప్రతినిధు వీసాలకు కూడా గడువు తగ్గుతుంది. ఈ తరహా వీసాదార్లు అమెరికాలో ఇంతకు ముందటితో పోలిస్తే తక్కువ సమయం ఉండాల్సి వస్తుంది.ఈ రెండు రకాల వీసాల గడువు కుదింపు నిర్ణయం ఖరారు అయిందని వీసా , ఇమిగ్రేషన్ వ్యవహారాల హోం ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (డిహెచ్ఎస్) పత్రికా ప్రకటన వెలువరించింది. ఇకపై స్టూడెంట్ వీసాదార్లు, మీడియా వారు పరిమిత సమయం వరకూ అమెరికాలో ఉండటానికి వీలుంటుందని అధికారిక ప్రకటనతో స్పష్టం అయింది. 1978 నుంచి ఎఫ్1 వీసా హోల్డర్లు అయిన విదేశీ విద్యార్థులు అమెరికాలో అనిర్దేశిత సమయం వరకూ ఉండే వీలుంది. దీనిని డ్యూరేషన్ ఆఫ్ స్టే అని వ్యవహరిస్తారు. ఈ హోదాతో ఉండే వారు ఇతర వీసాల మాదిరిగా కాకుండా , ఎంతకాలం అయినా ఎటువంటి తనిఖీలు ఇతరత్రా పరిశీలనలు లేకుండా అమెరికాలో ఉండవచ్చునని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఇతరత్రా వీసాలు పొందిన విద్యార్థులు, మీడియా సిబ్బంది , అమెరికా ఔదార్యతను అడ్డుపెట్టుకుని ఇష్టం వచ్చినంత కాలం తిష్టవేసుకుని ఉంటున్నట్లు తాము గుర్తించామని, దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఇప్పుడు నిబంధనలలో మార్పులు తలపెట్టినట్లు వివరించారు. దీని వల్ల తలెత్తే భద్రతాపరమైన అంశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు ఇతర రకాల వీసాదార్లపై చెక్‌పెట్టినట్లు అధికారులు తెలిపారు. వీరి వైఖరి వల్ల అమెరికాలో పన్నుల చెల్లింపుదార్ల డాలర్లకు, అమెరికా పౌరులకు నష్టం వాటిల్లుతోందని , దీనిని గుర్తించి, సరైన విధంగా నియంత్రించేందుకు నిబంధనలను మార్చినట్లు తెలిపారు. ఇక విదేశీ మీడియా వారు ఇకపై 240 రోజుల వరకూ అమెరికాలో ఉండటానికి వీలేర్పడుతుంది. ఆంక్షల నేపథ్యంలో చైనా మీడియా ప్రతినిధులకు గడువులను మరింతా కుదించనున్నారు.

# చైనా విద్యార్థులు లేకుంటే ఇబ్బందే

అమెరికాలో విద్యాభ్యాసం నిమిత్తం అరు లక్షల మంది చైనా విద్యార్థులను అనుమతించాలన్న తన నిర్ణయాన్ని దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. వారు లేకుంటే అమెరికా కాలేజీలు దెబ్బతింటాయని చెప్పారు. అయితే 'అమెరికా ఫస్ట్' అనే ట్రంప్ వైఖరికి, గతంలో అమలు చేసిన పరిమిత వీసా విధానాలకు ఇది భిన్నంగా ఉన్నదని కన్సర్వేటివ్ మిత్రులు విమర్శలు కురిపించారు. 'వారి విద్యార్థులను అనుమతించకూడదంటూ చాలా కథనాలు నేను విన్నాను. అమెరికాలోకి వారి విద్యార్థులను మేము అనుమతించబోతున్నాము. ఇది చాలా ముఖ్యం. ఆ ఆరు లక్షల విద్యార్థులు చాలా ముఖ్యం. కానీ మనం చైనాతో కలిసి ముందుకు సాగుతున్నాం' అని శ్వేతసౌధంలో ట్రంప్ విలేకరులకు తెలిపారు. చైనా, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న సమయంలో ట్రంప్ చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. 'విదేశీ విద్యార్థులు స్వదేశానికి వెళ్లిన తర్వాత పాఠశాలలు నెలకొల్పి వాటిని నడుపుతారని, అందువల్ల వారిని అనుమతించకూడదని అనడం అవమానకరమని నేను అనుకుంటున్నాను. వారి విద్యార్థులు ఇక్కడికి రావడాన్ని నేను ఇష్టపడతాను. వారు రాకపోతే ఏం జరుగుతుందో మీకు తెలుసా? మన కాలేజీ వ్యవస్థ త్వరగానే కూలిపోతుంది. అవి ప్రముఖ కళాశాలలు కాలేవు. చాలా ఇబ్బందులు పడతాయి' అని ట్రంప్ వివరించారు. కఠినమైన పరిశీలన జరిపితే అనేక అమెరికా కాలేజీలు ఆర్థికంగా దెబ్బతింటాయని చెప్పారు. కాగా చైనా విద్యార్థుల రాకను 'మాగా' ఉద్యమకారులు



తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 201920లో అమెరికాలో చైనా విద్యార్థుల నమోదు గరిష్ట స్థాయికి.. అంటే 3,72,000కు చేరింది. కానీ ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినడంతో 2023లో ఆ సంఖ్య 2,77,000కు పడిపోయింది.


# సెప్టెంబర్ 3న చైనా విజయ దినోత్సవ పెరేడ్

సెప్టెంబర్ 3న జరగనున్న చైనా విజయదినోత్సవ 80వ వార్షిక పెరేడ్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జొంగ్ యున్, తదితర 26 మంది విదేశీ నేతలు పాల్గొననున్నారు. జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా (ఫాసిస్ట్ వ్యతిరేక ) జరిగిన యుద్ధంలో చైనా విజయం సాధించినందుకు, రెండవ ప్రపంచ యుద్ధం ముగింపును గుర్తు చేసుకుంటూ ఈ సైనిక కవాతు నిర్వహిస్తున్నట్టు చైనా గురువారం వెల్లడిరచింది. అయితే ఈ పెరేడ్‌కు ప్రపంచ నాయకులు ఎవరూ హాజరు కావద్దని జపాన్ అభ్యర్థించడం దౌత్యపరమైన చిచ్చు రగిలించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ఆహ్వానంపై 26 మంది విదేశీ నేతలు హాజరవుతారని చైనా సహాయ విదేశాంగ మంత్రి హాంగ్ లీ పేర్కొన్నారు. తియాన్‌జిన్ నగరంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు షాంఘై కోఆపరేషన్‌ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) సదస్సు నిర్వహించిన తరువాత బీజింగ్‌లో పెరేడ్ నిర్వహిస్తారు. షాంఘై సదస్సుకు హాజరయ్యే విదేశీ నేతలందరినీ పేరేడ్‌లో హాజరయ్యే విధంగా చైనా ప్రయత్నిస్తుండడం జపాన్‌కు ఆగ్రహం తెప్పించింది. విజయదినోత్సవ పెరేడ్ పేరుతో జపాన్ వ్యతిరేక కార్యక్రమాలను చైనా నిర్వహిస్తోందని జపాన్ ఆరోపిస్తోంది. అందులో పాల్గొన్న నాయకులను అత్యంత జాగ్రత్తగా గమనించడమౌతుందని పేర్కొంది.



# ఇది మోడీ చేయిస్తున్న యుద్ధమే..

భారత్‌పై అమెరికా సుంకాలు మొదలైన గంటల వ్యవధిలోనే యూఎస్ మరోసారి షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. రష్యాఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం 'మోడీ చేస్తున్న యుద్ధం' అని వైట్ హౌస్ ట్రేడ్ సలహాదారు పీటర్ నవారో సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం వల్లనే ఈ యుద్ధం కొనసాగుతోందని నవారో ఆరోపించారు. ఈ చమురు కొనడం ఆపేస్తే యూఎస్ వేస్తున్న సుంకాలు 25 శాతం తగ్గుతాయన్నారు. 'ఇది మోడీ యుద్ధమే. ఎందుకంటే శాంతికి వెళ్లే మార్గం న్యూఢల్లీ గుండానే వెళ్తుంది' అని నవారో అభిప్రాయపడ్డారు. భారత్‌కు డిస్కౌంట్‌లో చమురు అమ్ముతున్న రష్యా.. ఆ డబ్బుతో ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తోందని, దీంతో ఉక్రెయిన్‌కు యూఎస్ సహకారం చేయడం వల్ల అమెరికాకు నష్టం వాటిల్లుతోందని నవారో వివరించారు. 'ఇండియా చేస్తున్న పని వల్ల యూఎస్‌లో అందరికీ నష్టమే. భారత సుంకాల వల్ల అమెరికాలోని వినియోగదారులు, వ్యాపారులు, ఉద్యోగులు, ఫ్యాక్టరీలు అందరికీ నష్టాలే. వీటిని సరిదిద్దేందుకు, మోడీ చేస్తున్న ఈ యుద్ధాన్ని నిలువరించేందుకు యూఎస్ ప్రజలపై భారం పడుతోంది' అని నవారో పేర్కొన్నారు. భారత్ ఈ విషయంలో చాలా యారొగెంట్‌గా వ్యవహరించడం బాధాకరమన్నారు. 'మాకు సుంకాలు ఎక్కువేం కాదు. మా సార్వభౌమత్వం ముఖ్యం. మా ఇష్టం వచ్చిన వారి నుంచి చమురు కొంటాం' అని భారత్ అంటుందని, అయితే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అలాంటి బాధ్యతతో వ్యవహరించాలని నవారో సూచించారు.



# అమెరికాకు షాకిచ్చిన జపాన్



ప్రధాని మోదీ పర్యటన వేళ సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికాకు జపాన్ షాకిచ్చింది. పెట్టుబడులపై చర్చించేందుకు అగ్రరాజ్యంలో పర్యటించాల్సిన జపాన్ వాణిజ్య మంత్రి చివరి నిమిషంలో తన పర్యటనను రద్దు చేసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జపాన్‌పై 25 శాతం సుంకాలు విధించారు. దీంతో ఆ దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు టోక్యో నిర్ణయించింది. ఇందులో భాగంగా 550 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి ఇరు దేశాలు ఇప్పటికే చర్చలు ప్రారంభించాయి. దీంతో సుంకాలను 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. వాణిజ్య చర్చల్లో భాగంగా జపాన్ మంత్రి ర్యోసీ అకజవా గురువారం అమెరికాకు బయల్దేరాల్సి ఉంది. అయితే, చివరి నిమిషంలో ఆయన తన పర్యటనను ఆయన రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జపాన్ వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి యోషిమసా హయాషి ఓ ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో పెట్టుబడులకు సంబంధించి అడ్మినిస్ట్రేషన్ స్థాయిలో ఇంకా కొన్ని అంశాలపై చర్చించాల్సి ఉండటంతో ర్యోసీ తన పర్యటనను రద్దు చేసుకున్నారని అందులో వెల్లడిరచారు. దీంతో ఇరు దేశాల మధ్య అధికారికంగా ఒప్పందం కుదరాల్సి ఉండగా, మంత్రి పర్యటన రద్దవడంతో అది మరింత ఆలస్యం కానుంది. ప్రధాని మోదీ జపాన్‌లో పర్యటిస్తున్న సమయంలోనే ఇది చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ టోక్యో చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన టోక్యో విమానాశ్రయంలో దిగారు. ఇరుదేశాల 15వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. అనంతరం జపాన్ ప్రధాని ఇషిబాతో భేటీ కానున్నారు. ఏఐ, సెమీకండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా వీరి మధ్య ద్వైపాక్షిక చర్చ జరగనుంది. అక్కడి నుంచి ప్రధాని మోదీ చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు.

# ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్

ఉత్తరాఖండ్‌లో వరుస క్లౌడ్ బరస్ట్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే రెండు సార్లు క్లౌడ్ బరస్ట్‌లు జరగ్గా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ఇక ఇప్పుడు మరోసారి రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ జరిగింది. దీంతో అలకనంద ఉగ్రరూపం దాల్చింది. వరద ప్రవాహానికి పలు ఇళ్లు కొట్టుకుపోయినట్టు సమాచారం అందుతోంది. భారీ వర్షాలకు ఇళ్లు నేల కూలడంతో శిథిలాల కింద అనేకమంది బాధితులు చిక్కుకున్నట్టు తెలుస్తోంది. చమోలీ జిల్లా తహసిల్ దేవల్ లోని మోపాటలో వరదల్లో ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోయినట్టు సమాచారం. అంతే



కాకుండా కేదారి ఘాటిలోని వాలారా గ్రామంలో వంతెన కొట్టుకుపోవడంతో తీవ్రనష్టం జరిగింది. ప్రమాదంపై సీఎం పుష్కర్ సింగ్ ఘామి ఎక్స్ వేదికగా స్పందించారు. స్థానిక అధికారులు యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ ప్రమాదంపై తాను నిరంతరం అధికారులతో సంప్రదిస్తున్నానని చెప్పాఅరు. కలెక్టర్, అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేసినట్టు తెలిపారు. ప్రజలు క్షేమంగా బయపడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

# 'ఓట్ చోరీ' మరిన్ని ఆధారాలు బయటపెడతా

**పాట్నా:** 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బీజేపీ, ఎన్నికల సంఘంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తమ ఓట్లను దొంగిలిస్తే బీహార్ ప్రజలు సహించబోరన్నారు. ఓటర్ల జాబితా నుంచి రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆక్షేపించారు. అందులో ఎక్కువమంది బడుగు బలహీన వర్గాల వారే ఉన్నారని అన్నారు.సీతామఢలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 'ఓట్ చోరీ' గురించి రానున్న రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని అన్నారు. ''ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై ఓట్లను



దొంగిలించాయి. గతంలో మహారాష్ట్ర, హర్యానా, కర్నాటకలో ఇదే పంథా కొనసాగించారు. ఇప్పుడు బీహార్ వంతు వచ్చింది. కానీ, ఇక్కడి ప్రజలు దీన్ని సహించరు.'' అని అన్నారు. యాత్రలో భాగంగా స్థానిక సీతాదేవి ఆలయాన్ని రాహుల్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిరదంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం తీరును తప్పుబడుతూ రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈనెల 17న ప్రారంభమైన యాత్ర.. 16 రోజుల పాటు 1,300కి.మీ మేర సాగనుంది. వచ్చే నెల 1న పాట్నాలో నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in